

## నాలోంచి సంగీతం ఎలా వస్తుందో నాకే తెలియదు

'ఈ సినిమా కోసం నేనిచ్చిన ట్యూన్‌కి కీరవాణి పాట రాశారు. తను రాసిన పాట పల్లవి విన్నప్పుడు.. తన మనసులో నాపై ఉన్న అభిమానాన్నీ, ఆత్మబంధాన్నీ క్రోడీకరించి రాశారనిపించింది. సంగీత దర్శకుడు కావడానికి ముందూ, అయిన తర్వాత కూడా నాపై ఆయనకున్న అభిమానం అలాగే ఉంది.' అన్నారు సంగీత దర్శకుడు ఇళయరాజా. రూపేష్, ఆకాంక్షాసింగ్ జంటగా.. 'లేడీస్ టైలర్'ఫేం రాజేంద్రప్రసాద్, అర్చన మరో జంటగా రూపొందిన చిత్రం 'షష్టిపూర్తి'. పవన్‌ప్రభ దర్శకత్వంలో రూపేష్ చౌదరి నిర్మించిన ఈ చిత్రానికి ఇళయరాజా సంగీతం అందించారు. త్వరలో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన టీజర్ లాంచ్ కార్యక్రమంలో ఇళయరాజా మాట్లాడారు. ఇంకా చెబుతూ 'ఈ సినిమాకు నేను చేసిన స్వరాలలో కొన్నింటిని మీరు విన్నారు. వినబోతున్నారు. వింటూనే ఉంటారు. ఇది నమ్మకంతో చెబుతున్నమాట. నేను చేసిన వేలాది పాటల్లో నాకు నచ్చినపాట ఏదని అడిగితే.. ఒకటా రెండా?! నాకు ఎంత సంగీతం తెలుసన్నది ఇక్కడ ముఖ్యంకాదు. సంగీతమే నా గురించి తెలుసుకుంది. నాలోంచి సంగీతం ఎలా వస్తుందో నాకే తెలీదు. ఎప్పటికీ తెలియకూడదని దేవుణ్ని కోరుకుంటున్నా. తెలిసిన మరుక్షణం నేను సంగీతాన్ని ఆపేస్తాను. ఈ సినిమాకు పనిచేసిన అందరికీ దేవుడి ఆశీస్సులు ఉండాలి.' అని ఇళయరాజా పేర్కొన్నారు. ఇళయరాజా సంగీతం వల్లే తాను హీరోగా నిలబడ్డానని రాజేంద్రప్రసాద్ గుర్తుచేసుకున్నారు. కీరవాణి మాట్లాడుతూ ' ఏదో ఏ జన్మలోదో ఈ పరిచయం.. నీదో, నీవల్ల నాదో ఈ పరవశం.. రాగం నీదై.. పల్లవి నాదై.. చరణం చరణం కలిసిన వేళ పయనాలు ఏ హిమాలయాలతో..' ఇది ఈ సినిమా కోసం రాజాసార్ ఇచ్చిన ట్యూన్‌కి నేను రాసిన పల్లవి. సినిమాలోని ఈ పాట సందర్భాన్నీ, నా జీవితాన్నీ రెండింటినీ ముడిపెట్టి ఈ పల్లవి రాశా. నేను రాజాగారి వీరాభిమానిని. ఆయన సంగీతంలో పాడాలనేది నా కోరిక. కానీ పాట రాసే మహద్భాగ్యం కలిగింది.' అని ఆనందం వెలిబుచ్చారు. ఇంకా చిత్ర బృందం అంతా మాట్లాడారు.

## ఆ విషయంలో గందరగోళానికి గురయ్యా..

'హీరోయిన్‌గా కెరీర్‌ని సాగించడం తేలిక కాదు. దానికి కఠోర శ్రమ చేయాలి. కడుపు మాడ్చుకోవాలి. జిమ్‌లో గంటల తరబడి గడపాలి. హీరోయిన్‌ని ఎంచుకోవడంలో ఒక్కో ఇండస్ట్రీది ఒక్కో అభిరుచి. బాలీవుడ్‌లో సన్నగా ఉండాలి. సౌత్ సినిమా అంటే బొద్దుగా ఉండాలి. రెండు ఆఫర్లూ ఒకేసారి వస్తే ఏదో ఒకటి వదులుకోవాల్సిందే.'

అంటూ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది నటి మాళవిక మోహనన్. 'కెరీర్ తొలి నాళ్లల్లో ఫిజిక్ విషయంలో గందరగోళానికి గురయ్యా, బొద్దుగా ఉండాలా? సన్నగా ఉండాలా? అనే ప్రశ్నలు నెలల పాటు నన్ను వెంటాడాయ్. మెల్లగా పరిస్థితులు అర్థమయ్యాయి. దాంతో ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలని నిర్ణయించుకున్నా.' అని తెలిపింది మాళవిక. ఈ ముద్దుగుమ్మ ప్రభాస్ 'ది రాజాసాబ్'తో తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే.



## వీఎఫ్‌ఎక్స్‌కి 75కోట్లు



మెగా అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'విశ్వంభర'. 'బింబిసార'ఫేం మల్లిడి వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. అందుకు తగ్గట్టే నిర్మాతలు కూడా ఎక్కడా రాజీ పడటం లేదు. కేవలం వీఎఫ్‌ఎక్స్‌కే 75కోట్లు ఖర్చు పెడుతున్నారు. హాలీవుడ్ సాంకేతిక బృందం ఈ సినిమా కోసం పనిచేస్తున్నారు. దీంతో దేశంలో రూపొందుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో 'విశ్వంభర' ఒకటిగా నిలిచింది. ఇందులో కారణజన్ముడిగా చిరంజీవి కనిపిస్తారట. విశ్వంభర అనే లోకానికీ కారణజన్ముడిగా పుట్టిన ఓ మానవుడికీ మధ్య సంబంధం ఏంటి? అనేదే ఈ సినిమా కథ అని సమాచారం. త్రిష కృష్ణన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అశికా రంగనాథ్, ఇషా చావ్లా, సురభి పురానిక్, కునాల్ కపూర్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: చోటా.కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాతలు: వి.వంశీకృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్‌రెడ్డి, నిర్మాణం: యూవీ క్రియేషన్స్.

## వన్‌డే హీరో నువ్వే ఫ్రెండూ.. నీ కోసమే డబుల్ సౌండూ..



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కథానాయకుడిగా టాలీవుడ్ అగ్ర దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతోన్న బహుభాషా చిత్రం 'కుబేర'. అగ్రనటుడు అక్కినేని నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్నారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు నిర్మాతలు. జూన్ 20న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా సినిమాలోని ఫస్ట్ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'పోయిరా పోయిరా పోయిరా.. పోయిరా మామా..' అంటూ సాగే ఈ పాటను భాస్కరభట్ల రాయగా, దేవిశ్రీప్రసాద్ స్వరపరిచారు. తమిళంతో పాటు తెలుగులో కూడా హీరో ధనుష్ స్వయంగా ఈ పాట పాడటం విశేషం. అతని గాత్రంలోని మాగ్నెటిక్ ఫోర్స్ పాటను మరోస్థాయికి తీసుకెళ్లిందని, శేఖర్ వి.జె కొరియోగ్రఫీ పాటకు ప్రాణం పోసిందని మేకర్స్ చెబుతున్నారు. 'వన్‌డే హీరో నువ్వే ఫ్రెండూ.. నీ కోసమే డబుల్ సౌండూ.. అస్సల్ తగ్గక్ అట్నే ఉండూ.. మొక్కుతారూ కాళ్లు రెండూ..' అంటూ హీరో నైజాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. పెళ్లి ఊరేగింపులో ధనుష్ ఆడి పాడుతూ ఈ పాటలో కనిపిస్తున్నారు. రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో జిమ్ సార్ఫ్ కీలక పాత్రధారి. ఈ చిత్రానికి నిర్మాణం: శ్రీవెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ, అమిగోస్ క్రియేషన్స్ ప్రై.లిమిటెడ్.

## ఈ కథను పరమశివుడే రాయించాడు



'ఈ సినిమా విషయంలో మేం ఏమీ ప్లాన్ చేసుకోలేదు. అన్నీ వాటంతటవే జరిగిపోయాయి. ఈ కథను ఆ శివుడే నాతో రాయించాడు. ప్రతి టెక్నీషియన్ ప్రాణం పెట్టి పనిచేశాడు. 20ఏళ్ల తమన్నా కెరీర్ ఒకపైపు, 'ఓదెల 2' ఒకపైపు అని అందరూ అంటున్నారు. వశిష్ట ఎన్.సింహాకు ఈ సినిమా పెద్ద బ్రేక్. ఇంతటి విజయాన్నిచ్చిన ప్రేక్షకులకు థ్యాంక్స్.' అని సంపత్‌నంది అన్నారు. ఆయన దర్శకత్వ పర్యవేక్షణలో రూపొందిన చిత్రం 'ఓదెల 2'. ఓటీటీ హిట్ 'ఓదెల రైల్వే స్టేషన్' సినిమాకు ఇది సీక్వెల్. తమన్నా ప్రధాన పాత్ర పోషించారు. అశోక్ తేజ దర్శకుడు. డి.మధు నిర్మాత. ఈ నెల 17న సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో సంపత్‌నంది మాట్లాడారు. తాము రివ్యూయర్స్ కోసం సినిమా చేయలేదని, ప్రేక్షకుల కోసమే సినిమా తీశామని, సినిమా బాగుంది కాబట్టే కలెక్షన్స్ పెరుగుతున్నాయని దర్శకనిర్మాతలు అశోక్‌తేజ, మధు పేర్కొన్నారు.

## వైవిధ్యమైన కథతో వీర చంద్రహాస

కేజీఎఫ్, సలార్ చిత్రాల సంగీత దర్శకుడు రవి బస్రూర్ దర్శకుడిగా మారి తెరకెక్కించిన చిత్రం 'వీర చంద్రహాస'. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ ఇందులో కీలక పాత్ర పోషించగా, శిథిల్ శెట్టి, నాగశ్రీ జీఎస్, ప్రసన్న శెట్టిగార్ మందార్తి, ఉదయ్ కడబాల్, రవీంద్ర దేవాడిగ, నాగరాజ్ సర్వేగర్, గుణశ్రీ ఎం.నాయక్, శ్రీధర్ కాసర్కోడు, శ్వేత అరెహోల్, ప్రజ్వల్ కిన్నాల్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఎస్.ఎస్.రాజ్‌కుమార్ నిర్మాత. ఈ నెల 18న కన్నడంలో విడుదలైన ఈ సినిమా అఖండవిజయం సాధించిందని మేకర్స్ చెబుతున్నారు. కంచి కామాక్షి-కోల్‌కతా కాళి క్రియేషన్స్ పతాకంపై ఎం.వి.రాధాకృష్ణ తెలుగులో ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. మంచి కంటెంట్ ఉన్న సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారనీ, 'వీర చంద్రహాస' అద్భుతమైన కంటెంట్ ఉన్న సినిమా అనీ, తెలుగులో తప్పక విజయం సాధిస్తుందని, త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తామని నిర్మాత ఎం.వి.రాధాకృష్ణ తెలిపారు.



## ఉత్కంఠను రేకెత్తించేలా ACE



తమిళ అగ్రహీరో విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో నటించిన మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'ACE'. అరుముగకుమార్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. మే 23న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా అధికారిక ప్రకటనతోపాటు పోస్టర్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. ఉత్కంఠకు గురిచేసే కథ, కథనాలతో ఈ సినిమా రూపొందిందని, విజయ్‌సేతుపతి కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచే సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. రుక్మిణి వసంత్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో యోగిబాబు, బి.ఎస్.అవినాష్, దివ్య పిళ్లై, బబ్లూ, రాజ్‌కుమార్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: కరణ్ బహదూర్.

## యూనివర్సల్ బ్యాచిలర్ కథ



జేపీ నవీన్, శ్రావణి శెట్టి జంటగా నటించిన చిత్రం 'ఏ ఎల్ సి సి'(ఓ యూనివర్సల్ బ్యాచిలర్). లేలీధర్‌రావు కోలా స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. లేలీధర్‌రావు మాట్లాడుతూ 'ఇది ఇష్టంతో తీసిన సినిమా. ఈ సినిమాకోసం మా టీమ్ ఎంతో కష్టపడింది. తప్పకుండా అందరికీ నచ్చే సినిమా అవుతుంది' అని నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సినిమాలో తమకు అవకాశం ఇచ్చినందుకు గాను హీరోహీరోయిన్లు నవీన్, శ్రావణి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంకా అతిథులుగా విచ్చేసిన దర్శకులు వి.సముద్ర, నగేష్ నారదాసి కూడా మాట్లాడారు.

## బరువు బాధ్యతలున్న అన్నయ్యగా కనిపిస్తా



'అన్నదమ్ముల అనుబంధాన్ని తెరపై ఆవిష్కరించే సినిమా 'సోదరా'. అన్నగా బరువుబాధ్యతలున్న పాత్రను ఇందులో పోషించా. సినిమా చూస్తున్నంతసేపూ ప్రేక్షకులకు తమ జీవితాల్లో జరిగిన సంఘటనలు గుర్తొస్తాయి. జనరల్‌గా నా సినిమాల్లో ఉండే వినోదంతోపాటు భావోద్వేగాలు కూడా ఇందులో ఉంటాయి.' అని తెలిపారు హీరో సంపూర్ణేష్‌బాబు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'సోదరా'. సంజోష్ ఇందులో మరో హీరో. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకుడు. చంద్ర చగంలా నిర్మాత. ఈ నెల 25న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంపూర్ణేశ్‌బాబు మాట్లాడారు. 'అమాయకుడైన అన్న, అప్‌డేట్ అయిన తమ్ముడు మధ్య నడిచే కథ ఇది. ఈ తరహా కథ ఇప్పటివరకూ రాలేదు. అన్నదమ్ములు కలిసుండాలనేది ఈ కథలో నీతి.' అని మరో హీరో సంజోష్ తెలిపారు.



# రాబడి


## డిబెంచర్లు అంటే?

### వీటిలో ఎన్ని రకాలుంటాయో తెలుసా..

**డిబెంచర్** అంటే ఓ రుణ సాధనం. సాధారణంగా మదుపరుల నుంచి నిధుల సమీకరణ కోసం కంపెనీలు లేదా ఆర్థిక సంస్థలు వీటిని జారీ చేస్తాయి. ప్రభుత్వాలు సైతం వీటిని వినియోగించుకోవచ్చు. ఈ డిబెంచర్లకు తాకట్టుగా ఎటువంటి ఆస్తులూ ఉండవు. జారీచేసేవారి పరపతి, విశ్వసనీయత మీదే ఇవి ఆధారపడి ఉంటాయి. ఇక ఈ డిబెంచర్లలో అనేక రకాలుంటాయి. వాటిని పరిశీలిస్తే..

**కన్వర్టబుల్ డిబెంచర్**

నిర్ణీత వ్యవధి తర్వాత కంపెనీ ఈక్విటీ షేర్లలోకి డిబెంచర్‌ను మార్చుకొనే వెసులుబాటు మదుపరులకు ఉంటుంది. దీంతో అప్పటి దాకా ఆ కంపెనీకి రుణదాతలుగా ఉన్న డిబెంచర్‌హోల్డర్లు.. షేర్‌హోల్డర్లుగా మారుతారు. అప్పుడు ఇవి మార్కెట్ లింక్డ్ డిబెంచర్ ఫీచర్లని సంతరించుకుంటాయి. స్టాక్ మార్కెట్లలో సదరు షేర్ల విలువ పెరిగితే లాభాలు, తగ్గితే నష్టాలు డిబెంచర్లు కొన్నవారికి వస్తాయన్నమాట.



**నాన్ కన్వర్టబుల్ డిబెంచర్**

ఇవి ఈక్విటీ షేర్లుగా మారవు. కాలపరిమితి మొత్తం నిర్దిష్ట ఆదాయంతోనే ఉంటాయి. మెచ్యూరిటీ వరకు ముందుగా నిర్ణయించిన వడ్డీరేటు ఆధారంగానే చెల్లింపులు జరుగుతాయి.

**రిజిస్టర్డ్ డిబెంచర్**

ఈ డిబెంచర్లను జారీచేసేవారు డిబెంచర్ హోల్డర్ల వివరాలను నమోదు చేసుకుంటారు. ఓ రిజిస్టర్‌లో వారి పేరు, చిరునామా, మొబైల్/ఫోన్ నెంబర్లు తదితర వివరాలను రికార్డ్ చేస్తారు. ఇవి మదుపరులకు ఓ స్థాయి భద్రతను కల్పిస్తాయి.

**అన్‌రిజిస్టర్డ్ డిబెంచర్**

వీటిని జారీచేసేవారి దగ్గర వ్యక్తిగత డిబెంచర్‌హోల్డర్ల వివరాలేవీ ఉండవు. అయితే ఇవి సెకండరీ మార్కెట్‌లో ట్రేడింగ్‌కు చాలా అనువైనవి. వీటి బదలాయింపు ఎంతో సులువు.

**రిడీమబుల్ డిబెంచర్**

వీటికి నిర్ణీత మెచ్యూరిటీ తేదీలుంటాయి. కాలపరిమితి తీరిన తర్వాత వాటి ముఖ విలువతో డిబెంచర్‌హోల్డర్ల నుంచి జారీచేసినవారు తిరిగి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దశలవారీగా లేదా మెచ్యూరిటీ సమయంలోనైనా వడ్డీ ఆదాయాన్ని తీసుకోవచ్చు.

**ఇర్రిడీమబుల్ డిబెంచర్**

వీటికి నిర్ణీత మెచ్యూరిటీ తేదీలుండవు. జారీచేసినవారు తిరిగి కొనాల్సిన పని లేదు. అయితే దశలవారీగా లేదా మెచ్యూరిటీ సమయంలోనైనా వడ్డీ ఆదాయాన్ని తీసుకోవచ్చు.

**సెక్యూర్డ్ డిబెంచర్స్**

కంపెనీ ఆస్తుల దన్నుతో ఈ డిబెంచర్లుంటాయి. ఒకవేళ వీటిని జారీచేసినవారు చెల్లింపుల ఎగవేతలకు పాల్పడితే.. ఇన్వెస్టర్లు సదరు ఆస్తులను అమ్ముకొని తమ పెట్టుబడులను తిరిగి పొందవచ్చు.

**అన్‌సెక్యూర్డ్ డిబెంచర్స్**

వీటికి ఎలాంటి ఆస్తుల భద్రతా ఉండదు. కంపెనీల ఆర్థిక స్థోమత, పరపతి మీదే చెల్లింపులు ఆధారపడి ఉంటాయి. భారీ రాబడులకు వీలున్నా.. రిస్క్ ఎక్కువ. ఇవేగాక ప్రిఫర్డ్, ఆర్డినరీ, పాక్షిక కన్వర్టబుల్ డిబెంచర్లూ ఉంటాయి.



| లాభాలు | నష్టాలు |
| --- | --- |
| రెగ్యులర్ ఆదాయం | డిఫాల్ట్ ముప్పు |
| పెట్టుబడి భద్రత | ఫీచర్లలో మార్పులు |
| నిర్దిష్ట రాబడులు | నిర్ణీత కాలపరిమితులు |
| పోర్ట్‌ఫోలియోల్లో వైవిధ్యం | మార్కెట్ రిస్క్ |

# బులియన్‌లో పెట్టుబడులు

## ఉన్న లాభాలేంటి?.. అనుసరించాల్సిన వ్యూహాలేంటి?

*నేటి ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులకు ఎన్నో మార్గాలున్నాయి. స్టాక్స్, బాండ్ల దగ్గర్నుంచి రియల్ ఎస్టేట్, మ్యూచువల్ ఫండ్ల వరకు మదుపునకు బోలెడు అవకాశాలు. తద్వారా ఒకప్పటితో పోల్చితే మనకున్న ఆదాయాన్ని అనేక రెట్లు పెంచుకోగలుగుతున్నాం కూడా. అయితే వీటన్నిటిలో బంగారంపై పెట్టుబడి అనేది ఎప్పటికీ ఎవర్‌గ్రీన్ అనే చెప్పాలి. ఇదో సురక్షిత, స్థిరమైన పెట్టుబడి కావడమే ఇందుకు కారణం. ఇక గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్స్ అనేక రూపాల్లో ఉంటాయి. ఆభరణాలు, డిజిటల్ గోల్డ్, సావరిన్ బాండ్లు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్, గోల్డ్ ఈటీఎఫ్‌లు ఇలా రకరకాలున్నాయి. అయినప్పటికీ భౌతిక రూపంలో బంగారపు కడ్డీలు, నాణేల్లో పెట్టుబడే అత్యంత సురక్షితం. అంతేగాక తెలివైన, చక్కని ఆలోచన.*



### బులియన్‌లోనే దేనికి?

గోల్డ్, బులియన్‌కు మధ్య ప్రధాన తేడా దాని రూపం, స్వచ్ఛత, పెట్టుబడి కోణాలే. సాధారణంగా బులియన్.. బంగారు కడ్డీలు, నాణేల రూపంలో ఉంటుంది. అత్యంత స్వచ్ఛత, అత్యధిక విలువ దీని సొంతం. ఇక కడ్డీలు, నాణేల్లో గోల్డ్ లభించినా.. నగలు, బాండ్లు ఇతరత్రా రూపాల్లోనూ ఉంటుంది. స్వచ్ఛత, విలువల్లో వ్యత్యాసాలుంటాయి. అయితే బులియన్‌లోనే ఎందుకు మదుపు చేయాలంటే?..

**భద్రత-స్థిరత్వం**

బులియన్ అత్యంత సురక్షితమైన పెట్టుబడి సాధనాల్లో ఒకటి. ఇతర రూపాల్లో కంటే ఇందులో బంగారం విలువ స్థిరంగా ఉంటుంది. పైగా ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం పరిస్థితుల్లో మరింత లాభదాయకంగా నిలుస్తుంది. ఈ క్రమంలోనే కచ్చితమైన రాబడులకు వీలుంటుంది.

**నగదీకరణ**

మనకు అవసరమైతే, ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడైనా నగదుగా మార్చుకోవడానికి అత్యంత సౌకర్యవంతంగా ఈ పుత్తడి ఉంటుంది. స్వచ్ఛత, విలువపరంగా ఎంతమాత్రం వేచిచూడాల్సిన పనిలేదు. రియల్ ఎస్టేట్, ఇతర బాండ్లలో, నగల్లో ఈ అవకాశాలు తక్కువ.



**అవగాహన అక్కర్లేదు**

బులియన్‌లో పెట్టుబడికి మార్కెట్ పరిజ్ఞానంతో పనిలేదు. స్టాక్ లేదా బాండ్ మార్కెట్లలో మార్కెట్ అవగాహన మదుపరులకు ఉండాల్సిందే. దీంతో కొత్తగా పెట్టుబడుల్లోకి వచ్చేవారు బులియన్ మార్కెట్‌ను వేదికగా ఎంచుకోవచ్చు.

**సంస్కృతి**

భారతీయుల సంస్కృతిలో బంగారం కూడా ఒక భాగమే. అందుకే చాలామంది పుత్తడిని ఓ విలువైన లోహంగానో, పెట్టుబడిగానో చూడటం కంటే దాన్ని ఓ సెంటిమెంట్‌గా భావిస్తారు. అందులో దైవత్వాన్నీ చూస్తారు. ఇదికూడా దేశీయ మార్కెట్‌లో పసిడికి వన్నె తగ్గకుండా చేస్తున్నది.

### పెట్టుబడికి వ్యూహాలు

ప్రతీ పెట్టుబడిలోనూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే మరింత రాబడులను ఒడిసి పట్టుకోవచ్చు. బంగారం విషయంలోనూ ఇంతే. అందుకున్న మార్గాలను పరిశీలిస్తే..

**చిన్నచిన్నగా**

చిన్నచిన్నగా పెట్టుబడులు పెట్టడం.. ఓ ప్రభావవంతమైన వ్యూహం అని చెప్పవచ్చు. మార్కెట్ పరిస్థితులనుబట్టి క్రమేణా మన పెట్టుబడులను పెంచుతూపోవాలి. దీనివల్ల ఆకస్మిక నష్టాలను అధిగమించవచ్చు.

**నాణేలు, కడ్డీల్లో**

మొదట్లో నాణేలపై పెట్టుబడులు పెట్టవచ్చు. ఈ ట్రేడింగ్ సులభంగా ఉంటుంది. ఆ తర్వాత పెద్దపెద్ద కడ్డీలవైపు వెళ్లాలి. ఈ మార్పు.. అమ్మకాలు, మీ పసిడి ఆస్తుల నిర్వహణను రక్షణాత్మకంగా మార్చగలదు.

**మార్కెట్ ట్రెండ్స్**

ప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌నుబట్టి నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమం. గోల్డ్ మార్కెట్‌నూ అనేక అంశాలు ప్రభావితం చేస్తుంటాయి. ద్రవ్యోల్బణం, భౌగోళిక-రాజకీయ అనిశ్చితులు కీలకం. కాబట్టి ఇతర మార్కెట్లు క్షీణిస్తుంటే.. గోల్డ్‌కు డిమాండ్ ఉంటుందని గుడ్డిగా అనుసరించకూడదు. పరిస్థితులను బట్టి పెట్టుబడుల కోసం ముందుకెళ్లాలి.

**నిల్వ**

భౌతిక బంగారంపై పెట్టుబడులు పెడుతున్నప్పుడు బ్యాంక్ లాకర్లు లేదా ప్రొఫెషనల్ వాల్ట్ సర్వీసులను మీ బులియన్ నిల్వల కోసం ఎంచుకోవడం ఉత్తమమని మరువద్దు.

**పన్నులు**

దేశీయంగా పసిడి క్రయవిక్రయాలు చేసేటప్పుడు పన్నులను చూసుకోవాలి. అప్పుడప్పుడు పన్నులు ఎక్కువగా ఉంటుంటాయి. దీనివల్ల వచ్చే లాభాలు పన్ను చెల్లింపులకే పోతాయి. కనుక పన్ను మినహాయింపులు, పన్నుల నుంచి చట్టబద్ధంగా ఉండే వెసులుబాట్లను తెలుసుకోవడం లాభదాయకం.

**చివరగా..**

ప్రస్తుతం దేశ, విదేశీ మార్కెట్లలో బంగారం ధరలు రికార్డు స్థాయిల్లో పరుగులు పెడుతున్నాయి. దేశీయంగా తులం ధర లక్ష రూపాయలకు చేరువైంది. ఈ నేపథ్యంలో పసిడి కొనుగోళ్లపై ఆచితూచి ముందుకెళ్లడం మంచిది. పెద్ద ఎత్తున కొనాలనుకున్నప్పుడు మార్కెట్ పరిణామాలను పరిశీలిస్తూ వెళ్లడమే తెలివైన మార్గం.




## కార్పొరేట్ ఫలితాలపై ఆధారం!

**ప్రతీకార** సుంకాల ప్రభావం నుంచి దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం బయటపడ్డాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 3,395.94 పాయింట్లు ఎగబాకి 78,553.20 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 1,023.10 పాయింట్లు ఎగిసి 23,851.65 దగ్గర ముగిసింది. ఇక ఈ వారం విషయానికొస్తే.. జనవరి-మార్చి త్రైమాసికానికిగాను ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు విడుదల చేసే ఆర్థిక ఫలితాలపై సూచీల కదలికలు ఆధారపడి ఉండనున్నాయి. ఇప్పటికే ప్రధాన ఐటీ రంగ కంపెనీల ఫలితాలు వచ్చేయగా.. మార్కెట్లపై ఆ మేరకు ప్రభావం కనిపించింది. కాబట్టి ఆయా బడా సంస్థలు ఆకర్షణీయ లాభాలను చూపితే మార్కెట్లు పరుగులు పెడతాయనే చెప్పవచ్చు. లేకపోతే అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోవడానికి ఆస్కారం ఉన్నది. కాగా, ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలు దేశీయ మార్కెట్లను ప్రభావితం చేస్తాయి. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,400 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,400-24,600 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**గమనిక..**

స్టాక్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.